క్లుప్తంగా

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రేపల్లె రూరల్: మండలంలోని పేటేరు పంచాయతీ 8వ వార్డులో ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి గురువారం గ్రామ సర్పంచ్ కనపర్తి వసుమతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. ఇప్పటికే గ్రామంలో సచివాలయ భవనం, పలు రహదారుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి రవికిరణ్ పాల్గొన్నారు.

ముగిసిన బతుకమ్మ ఉత్సవాలు



రేపల్లె: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా పట్టణంలోని స్వయం భూ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలు గురువారంతో ముగిశాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పురవీధుల్లో ఊరేగింపుగా పెనుమూడి కృష్ణానది వద్దకు చేరుకున్నారు. అమ్మవారిని నదిలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు బొలిశెట్టి లక్ష్మీతాయారు, సెక్రటరీ చుండూరు అనూహ్య, ట్రెజరర్ ఆలపాటి శైలజ, సంఘ సభ్యులు మెడతాటి అన్నపూర్ణ, చుండూరి ఇందుమతి, అంకిశెట్టి సుశీల పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు నేడు ఇంటర్వ్యూలు

కర్లపాలెం: మండలంలోని పలు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 10 వలంటీర్ పోస్టులకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఈఓపీఆర్డీ ఎ.ఎలీషాబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదగొల్లపాలెంలో 2, కొత్త నందాయపాలెంలో 1, పాత నందాయపాలెంలో 1, పేరలి 1, సమ్మెటవారిపాలెం 1, బుద్ధాం 1, గణపవరం 1, దుండివారిపాలెంలో ఒకటి వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన తెలిపారు. అభ్యర్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఈ-క్రాప్ ముసాయిదా జాబితా విడుదల

వేమూరు: రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ-క్రాప్ ముసాయిదా జాబితా ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి చందోలు సునీత గురువారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 15 వేల ఎకరాల్లో వరి పంట ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయడం జరిగిందని ఆమె తెలిపారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు జాబితా సామాజిక తనిఖీ కోసం ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఆర్బీకే పరిధిలో గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ-క్రాప్‌లో నమోదైన రైతుల అన్ని వివరాలు సమగ్రంగా చదివి వినిపించడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఈ-క్రాప్ ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు ఉన్నట్లయితే సవరణకు రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి, అభ్యంతరాలు రాత పూర్వకంగా తెలియజేయాలని ఏఓ కోరారు.

బాధితులకు ఆర్థిక సాయం



యాజలి(కర్లపాలెం): ఆపదలో ఉన్న వారికి స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాలని కాపు సంక్షేమ సేన నాయకులు మాడసాని బాలాజీ కోరారు. యాజలి గ్రామంలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇంటిని కోల్పోయిన యజమాని ఇక్కుర్తి శ్రీనివాసరావుకు రూ.5వేలు, 20కేజీల బియ్యం, రోడ్డు ప్రమాదంలో అంగ వైకల్యం ఏర్పడిన ఇక్కుర్తి పున్నారావుకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు కాపు సంక్షేమ సేన తరపున బాలాజీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సేన నాయకులు నీలి శరాబంది, ఇమడాబత్తుని నాగరాజు, బాల మోహన్‌రెడ్డి, బాల కోటేశ్వరరావు ఉన్నారు.

విదేశీ పర్యటనకు నగర కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 27 నుంచి నవంబర్ 5వ తేదీవరకు స్వీడన్, ఆస్ట్రేలియా దేశాల్లో యూనిడో నిర్వహించనున్న అంతర్జాతీయ వైనా ఎనర్జీ అండ్ క్లైమేట్ ఫోరమ్ సదస్సులో కమిషనర్ పాల్గొననున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, ఇతర పలు అంశాలపై విదేశీ పర్యటనకు వెళ్లేందుకుగాను గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆహ్లాదకరం..సూర్యలంక తీరం

- 13 నుంచి కార్తీక మాసం ప్రారంభం
- యాత్రికులకు స్వాగతం పలుకుతున్న సూర్యలంక తీరం



సూర్యలంక తీరంలో అలల సవ్వడి

బాపట్ల: కార్తీకమాసం వచ్చిందంటే చాలు...అందరి కళ్లు సూర్యలంక తీరంపైనే ఉంటాయి. నవంబరు 13 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. రాష్ట్రంలోనే సహజసిద్ధమైన తీరంగా పేరున్న సూర్యలంకకు కార్తీక మాసంలో పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో చేరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కార్తీక మాసంలో సముద్ర స్నానాలు ఆచరించడంతో పాటు తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి జీడిమామిడి తోటలో వన భోజనాలు చేయటం విశేషం. తీరానికి వన భోజనాలు చేసేందుకు అటవీ భూమిలోని జీడి మామిడి తోటలు, వన నర్సరీ చాలా అనువుగా ఉంటుంది. స్నానాల అనంతరం పూజలు చేసుకునేందుకు వీలుగా తీరం వెంబడే ఆంజనేయస్వామి దేవాలయం ఉంది.

రావాణా మార్గం ఇలా..

బాపట్ల నుంచి 9 కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి సూర్యలంక సముద్రతీరానికి వెళ్ళేవారు ముందుగా పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు చేరుకోవాలి. అక్కడి నుంచి ఆటో సర్వీసులు అందుబాటులో ఉంటాయి. బాపట్ల నుంచి నేరుగా సూర్యలంక వరకు ఆటోలు వెళ్తుంటాయి. ఒక్కో మనిషికి రూ.15 చార్జీ ఉంటుంది. సర్వీసులు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా కార్తీకమాసంలో వచ్చే ప్రతి ఆది, సోమవారాల రోజున బాపట్ల నుంచి ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. రైల్వే మార్గానవచ్చే వాళ్లకు స్థానిక రైల్వేస్టేషన్ నుంచి నేరుగా సూర్యలంకకు, బస్సు మార్గాన వచ్చే వాళ్లకు బాపట్ల పాత బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఇతర జిల్లాల నుంచి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం గుంటూరు బస్ స్టేషన్ నుంచి కూడా నేరుగా సూర్యలంక వెళ్లే బస్సులు అందుబాటులో ఉంటాయి.

విందు, వసతి సౌకర్యం..

సహజ సిద్ధమైన సూర్యలంక తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు, పర్యాటకులు సేదతీరేందుకు వీలుగా తీరం ఒడ్డున హరితా రిసార్ట్స్ సౌకర్యం ఉంది. తీరంలో మొత్తం 27 గదులు ఉండగా.. వాటిల్లో 25 ఏసీ, 2 నాన్ ఏసీ గదులు అందుబాటులో ఉన్నాయి. ఏసీ గదులు సోమవారం నుంచి శుక్రవారం వరకు ఎప్పుడు బుక్ చేసుకున్న రూ. 2500 చెల్లించాల్సి ఉంటుంది. శని, ఆదివారాల రోజుల్లో ఆ ధర రూ. 3500 ఉంటుంది. నాన్ ఏసీ గదులకు సోమవారం నుంచి శుక్రవారం వరకు రూ. 1680, శుక్ర, ఆదివారాల్లో రూ. 2,240 చెల్లించాల్సి ఉంటుంది. ఏసీ డీలక్స్ గదులకు సోమవారం నుంచి గురువారం రూ. 3248, శుక్ర, శని, ఆదివారాలు రూ. 3,920, సూట్ రూమ్స్ సోమవారం నుంచి గురువారం వరకు రూ.4,480, శుక్ర, శని, ఆదివారం రూ.6,160 అద్దె ఉంటుంది. ఏసీ రూమ్‌కు టిఫిన్ ఉచితంగా అందిస్తారు. కాటేజ్ రూములను ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకునే అవకాశం కలదు. వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. అదే విధంగా పర్యాటకుల సౌకర్యార్థం తీరం వెంబడి రెస్టారెంట్, గ్రూపు యాత్రికుల కోసం క్యాటరింగ్ సౌకర్యం, టూరిస్ట్ బోటు, తీరం వెంబడే జిమ్ సెంటర్‌ను కూడా నిర్వహిస్తున్నారు.



తీరం వెంబడి హరితా రిసార్ట్స్

కాయితి సైదారెడ్డి సేవలు చిరస్మరణీయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి



కాయితి సైదారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దగ్గుబాటి పురంధేశ్వరి

గుంటూరు మెడికల్: ఏబీవీపీ పూర్వ విదర్భ (మహారాష్ట్ర) ప్రాంత సంఘటనా కార్యదర్శి, ఆంధ్రరాష్ట్ర బీజేపీ బిల్డింగ్ కమిటీ చైర్మన్ కాయితి సైదారెడ్డి సంస్మరణ కార్యక్రమం కృష్ణనగర్ మెయిన్‌రోడ్డులోని గోల్డెన్ హోమ్స్‌లో గురువారం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి పాల్గొని సైదారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సైదారెడ్డి మృతి బీజేపీకి తీరని లోటన్నారు. పార్టీకి అంకిత భావంతో పనిచేసిన నేత సైదారెడ్డి అని కొనియాడారు. రానున్న రోజుల్లో సైదారెడ్డిని సేవలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. పార్టీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జీ, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోస్తాంధ్ర జోనల్ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, జిల్లా ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈదర శ్రీనివాసరెడ్డి, స్వరూపరాణి, పాలపాటి రవికుమార్, భీమినేని చంద్రశేఖర్, కుమార్ గౌడ్, తిరుపతిరావు, సుబ్బారావు, తోట రామకృష్ణ, టీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో గీతా పోటీలు



కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా ధార్మిక మండలి చైర్మన్ మురళీమోహన్

పాత గుంటూరు: పట్టాభిపురంలోని జిల్లా ధార్మిక మండలి చైర్మన్ తాడిశెట్టి మురళీమోహన్ కార్యాలయంలో జిల్లా ధార్మిక మండలి సభ్యుల సమావేశం నిర్వహించారు. గీతా జయంతిని పురస్కరించుకొని టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో ఉమ్మడిజిల్లాలో నిర్వహించనున్న గీతా పోటీలకు సంబంధించిన కరపత్రాలను మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 17న గుంటూరు టీటీడీ కల్యాణ మండపంలో, 23న నరసరావుపేట గీతా మందిరంలో, 24న బాపట్ల శివాలయంలో గీతా పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు 6,7,8,9 తరగతుల విద్యార్థులకు భగవద్గీత 3 అధ్యాయంలోని 1 నుంచి 30 శ్లోకాలు, పెద్దలకు 700 శ్లోకాలకు పోటీలు ఉంటాయని చెప్పారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ప్రోత్సాహక బహుమతులను అందజేస్తామని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహించాలని కోరారు. ధార్మిక మండలి సభ్యులు పి.సుబ్బారావు, టి.శివయ్య, సీహెచ్ శ్రీనివాసరావు, కె.ఆదినారాయణ రెడ్డి, ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త అమ్ముడు పాల్గొన్నారు. వివరాలకు 9989023329 నెంబర్‌లో సంప్రదించాలని అమ్ముడు కోరారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్

మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్



సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి చైర్మన్ హరిప్రసాద్

తెనాలిఅర్బన్: ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పేర్కొన్నారు. సాలిపేటలోని మున్షీ మస్తాన్ ఉర్దూ ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. అక్కడ అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం సీఎం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ దేవి కావాణి, డాక్టర్ షారోన్ రజిత్, డాక్టర్ యదునందన్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ జగం శ్యామ్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఎస్‌పీ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళను పరీక్షిస్తున్న డాక్టర్ జీవన లత

తెనాలిఅర్బన్: రెయిన్‌బో ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సంయుక్త ఆధ్వర్యంలో ఓమెగా హాస్పటల్ వారి సహకారంతో గురువారం ప్రకాశం రోడ్డులో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ జీవనలత, డాక్టర్ మహితి, డాక్టర్ రసజ్ఞలు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. షుగర్, ఆర్‌బీఎస్, థైరాయిడ్ వంటి పరీక్షలు కూడా ఉచితంగా చేశారు. అవసమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెయిన్ బో ట్రస్ట్ సభ్యులు కళ్యాణి, వరలక్ష్మి, జ్యోతి, గాయత్రీ, రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ప్రతినిధులు కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, జి.వెంకటరత్నం, కొఠారి చేతన్, నరేష్, కిరణ్, నల్లూరి వెంకటేశ్వరరావు, జగదీశ్వరాంబ, అర్జున్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల సూచించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో తెనాలి పట్టణంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు సాలిపేటలో గురువారం పౌష్టికాహారాన్ని ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీబీ తెనాలి సూపర్‌వైజర్ పల్లెకొండ రవి కుమార్, 19వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు చుండూరు సాయి, హెల్త్ విజిటర్‌లు పుష్పలత, దాసరి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

వేమూరు: విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పోలీసు అమర వీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు గురువారం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, రైటర్ ప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలకు రావాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు రెగ్యులర్‌గా పాఠశాలలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పేర్కొన్నారు. గురువారం రైలుపేటలోని నగరపాలకసంస్థ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఖాసిం విద్యార్థుల హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పాఠశాలలో విద్యార్థులందరు నూరుశాతం మేరకు జగనన్న గోరుముద్ద స్వీకరించేలా అవగాహన కల్పించాలని సూచించారు.

మద్యం మత్తులో స్నేహితుడి హత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తిని తన స్నేహితుడు హత్య చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటరమణ కాలనీకిచెందిన బి.ఓంకారాచారి (20), సీతమ్మకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు ఇరువురు స్నేహితులు. ఇరువురు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇరువురు కలిసి బుధవారం రాత్రి శ్యామలానగర్ రైల్వేగేటు సమీపంలో సాయికృష్ణ బార్‌కు వెళ్లి అతిగా మద్యం సేవించారు. బార్ బయటకు వచ్చి ఇరువురు ఘర్షణ పడ్డారు. వెంకటేశ్వర్లు తన చేతిలోని మద్యం బాటిల్‌తో ఓంకారాచారిని పొడిచి పారిపోయాడు. స్థానికులు బాధితుడిని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఓంకారాచారి మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28న మధ్యాహ్నం నుంచి ఆలయాలు మూసివేత

పాత గుంటూరు: చంద్రగ్రహణం సందర్భంగా కొత్తపేటలోని ఆంజనేయ స్వామి దేవస్థానం, జగన్నాథ స్వామి దేవస్థానం, లాలాపేటలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానాలు 28న మధ్యాహ్నం 12.30 నిమిషాల నుంచి మూసి వేయనున్నట్లు ఈఓ జొన్నకూటి సూర్యప్రకాశరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ శుద్ధి సంప్రోక్షణ కార్యక్రమాల అనంతరం 29న సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వార్ల పునఃదర్శనం భక్తులకు కల్పించనున్నట్లు తెలిపారు.

వ్యభిచార నిర్వాహకుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకురాలు, ఇద్దరు విటులపై నగరంపాలెం పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేవీపీ కాలనీ 1వలైనులో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో పోలీసులు గురువారం దాడిచేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకురాలు, ఇద్దరు విటులను, ఒక మహిళను స్టేషన్‌కు తరలించారు. మహిళను రెస్క్యూ హోంకు తరలించారు. నిర్వాహకురాలు, విటులపై కేసు నమోదు చేశారు.

లైన్‌మెన్‌పై దాడి

గుంటూరు ఈస్ట్: విద్యుత్ లైన్‌మెన్‌పై వినియోగదారుడు దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొంగరాలబీడులో నివాసం ఉండే చిన్నం చంటి సకాలంలో విద్యుత్ బిల్లు చెల్లించలేదు. దీంతో ఆప్రాంతంలో విధులు నిర్వహించే లైన్‌మెన్ కె.రవీంద్రనాథ్ బుధవారం చంటి ఇంటికి వెళ్లి ఫీజు తీశాడు. చంటి అతనిని అడ్డుకుని దుర్భాషలాడాడు. లైన్‌మెన్ రవీంద్రనాథ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ త్రో బాల్ పోటీల్లో బహుమతులు

తెనాలి: జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టు రన్నర్స్ స్థానాన్ని గెలుచుకోగా, పురుషుల జట్టు తృతీయ బహుమతిని దక్కించుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని బిజినూర్‌లో ఈనెల 22-24 తేదీల్లో జాతీయ త్రోబాల్ పోటీలు జరిగాయి. రన్నర్స్‌గా నిలిచిన మహిళల జట్టును, తృతీయ బహుమతిని గెలిచిన పురుషుల జట్టు క్రీడాకారులను రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రభుకుమార్, జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రావిపాటి వీర నారాయణరావు, సంఘ సభ్యులు బాలాజీనాయక్, నల్లూరి వెంకటేశ్వరరావు అభినందించారు.

నేడు సాలీపేట ఉర్దూ స్కూల్‌లో వైద్య శిబిరం

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాలీపేటలోని మున్షి మస్తాన్ ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లో వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24వ సచివాలయం పరిధిలోని ప్రజలకు ఇక్కడ వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు.

అమర జవానుల త్యాగాలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న ఎస్ఐ అంబటి చంద్రశేఖర్, హెచ్ఎం

భట్టిప్రోలు: అమర జవానుల త్యాగాలకు హాట్స్ప్రింగ్(వేడి నీటి బుగ్గ) ప్రతీకగా నిలుస్తుందని ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో విద్యార్థులతో పోలీసు సిబ్బంది మాట్లాడారు. భారత్-చైనా సరిహద్దుల్లోని అక్సారు చిన్ ప్రాంతంలో 16 వేల అడుగుల ఎత్తున రక్తం గడ్డ కట్టే మంచు పర్వతాల మధ్యలో ఉండే హాట్స్ప్రింగ్ అమర జవానులకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకుంటూ నిర్వహించే పోలీస్ అమరవీరుల దినోత్సవం ఈ పవిత్ర స్థలం నుంచే ప్రారంభమైందని వివరించారు. మండల స్థాయిలో హైస్కూల్ విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో 12 మంది ప్రతిభ చాటారు. వీరిని జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, కానిస్టేబుల్ వి.వెంకటేశ్వరరావు, మహిళా కానిస్టేబుళ్లు ఎస్.లక్ష్మి దుర్గమ్మ, జేజే జ్యోతి పాల్గొన్నారు.

520 మందికి వైద్య పరీక్షలు

రేపల్లె రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అయోవా బాలికోన్నత పాఠశాలలో 14, 15 వార్డుల ప్రజలకు గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య బృందం సభ్యులు 520 మందికి వైద్య సేవలు అందించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో మునిసిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, కమిషనర్ విజయసారథి, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త పాల్గొన్నారు.

శ్రీనివాసరావు సేవలు ఎనలేనివి

రేపల్లె: ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి బెజ్జం శ్రీనివాసరావు 5వ వర్ధంతి ఉప్పూడి రోడ్డులోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. శ్రీనివాసరావు పేదల కోసం చేసిన ఉద్యమాలను, సేవలను కొనియాడారు. అధ్యక్షురాలు టి.శివనాగులు, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఏసమ్మ, నాయకులు కల్పన, నన్ని, మరియమ్మ, సుధారాణి, రాఘవులు పాల్గొన్నారు.